నిర్మించారు.. పంపిణీ మరిచారు..

- రెంజల్, బాల్కొండ మండలాల్లో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయని అధికారులు
- పేదలకు తప్పని ఎదురుచూపులు



బాల్కొండలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు (ఇన్‌సెట్‌లో) పగిలిన కిటికీల అద్దాలు

రెంజల్(బోధన్)/బాల్కొండ: రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని చేపట్టింది. ఈక్రమంలో ఇళ్ల కోసం నిధులు సైతం మంజూరు చేసింది. కానీ బాల్కొండ, రెంజల్ మండలాల్లో నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు కాలయాపన చేయడంతో కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తికాలేదు. మరి కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా పేదలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పేదలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఆశల సౌధం ఇంకా అందకపోవడంతో తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా మా పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

బాల్కొండ మండల కేంద్రంలో 100 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని 2017లో పనులకు శంకుస్థాపన చేశారు. పనులు కొనసాగుతుండగానే ప్రభుత్వం మరో 70 ఇళ్ల నిర్మాణాలకు మంజూరు ఇవ్వడంతో ఆ ఇళ్లను కూడ నిర్మించారు. 2023 జనవరిలో పనులు పూర్తయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 170 ఇళ్లలో 100 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు కేటాయించారు. కానీ మిగతా 70 ఇళ్లను మాత్రం ఏడాదిగా ఊరిస్తూనే ఉన్నారు. పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయకుండా, తాళాలు వేయకుండా అధికారులు అలానే వదిలేశారు. ఆకతాయిలు ఇళ్ల కిటికీల అద్దాలను, తలుపులను ధ్వంసం చేస్తున్నారు. మందుబాబులు సైతం విందులు చేసుకుంటున్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తిలో 50, కళ్యాపూర్‌లో 30, దూపల్లి గ్రామంలో 25 వరకు డబుల్ బెడ్‌రూంలను నిర్మించారు. సుమారు ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయలేదు. ఈ క్రమంలో ఇటీవల కళ్యాపూర్, కందకుర్తి గ్రామాల్లో పేదలు ఆక్రమణలకు సిద్ధపడ్డారు. కందకుర్తిలో రోడ్డెక్కి బైఠాయించారు. రెవెన్యూ, పోలీసులు జోక్యం చేసుకుని అధికారికంగా అందించే వరకు సంయమనం పాటించాలని వారికి సర్దిచెప్పి, డబుల్ బెడ్‌రూంలకు అధికారులు తాళాలు వేశారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాల్సి ఉండగా, నాయకులు సూచించిన వారినే ఎంపిక చేసి జాబితాను సిద్ధం చేశారని ఆరోపణలు ఉన్నాయి. అదే ఆధారంగా ఇటీవల కొందరు ఆక్రమణలకు పూనుకున్నారు. లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంపిక గందరగోళంగా మారింది.



కళ్యాపూర్‌లో..

ఇళ్ల కోసం డబ్బుల వసూలు..

రెంజల్ మండలంలో డబుల్‌బెడ్‌రూంలు అందిస్తామని ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరి వద్ద సుమారు. రూ.20వేలు నుంచి రూ.40 వేల వరకు వసూలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ ప్రతినిధికి సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు డబుల్‌బెడ్‌రూంల పంపిణీలో అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆయా గ్రామాల్లో అర్హులను గుర్తించి పూర్తయిన ఇళ్లను అందించాలని ప్రజలు కోరుతున్నారు.



కందకుర్తిలో ఇళ్ల కోసం రాస్తారోకో నిర్వహిస్తున్న పేదలు (ఫైల్)

కలెక్టర్‌కు నివేదించా..

కందకుర్తి గ్రామంలో జరిగిన ఆక్రమణల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లాను. కళ్యాపూర్ గురించి అంతగా అవగాహన లేదు. పైస్థాయి అధికారులు నిర్ణయించిన విధంగా తదుపరి ప్రక్రియను పూర్తి చేస్తాము.

– శ్రావణ్‌కుమార్, తహసీల్దార్, రెంజల్

క్లుప్తంగా

చెక్‌పోస్ట్ పునరుద్ధరణ

రుద్రూర్: మండలంలోని పోతంగల్ శివారులో ఆదివారం రెవెన్యూ అధికారులు చెక్‌పోస్ట్‌ను పునరుద్ధరించారు. మంజీరా నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేయకుండా నియంత్రించేందుకు చెక్‌పోస్ట్ వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

హామీలను నెరవేర్చాలి



ఆర్మూర్‌టౌన్: ఆటో డ్రైవర్లను అదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీని నెరవేర్చాలని ఏఐటీయూసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి సాయిలు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం స్పందించి ఆటోడ్రైవర్‌లను అదుకోవాలన్నారు. అనంతరం గ్రామానికి ఇద్దరి చొప్పున 64మందితో ఆర్మూర్ డివిజన్ నూతన కమిటీతోపాటు 20 మందితో యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు బక్కన్న, శుభాష్, శ్రీనివాస్, గురువయ్య, రమేష్, రాజేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

రోడ్లపై పశువులు.. వాహనదారుల ఇక్కట్లు



బాల్కొండ: మండల కేంద్రంలోని రహదారులపై పశువులు సంచరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయాల వద్ద వదిలేసిన గోమాతలు, పశువులను పట్టించుకునే వారు లేకపోవడంతో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. రోడ్డుపై వాహనదారులకు అడ్డుగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పశువులు రోడ్లపై సంచరించకుండా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

విరగకాసిన 'మామిడి'



బాల్కొండ: ముప్కాల్‌మండలం మండలం రెంజర్లకు చెందిన రైతు కోమటిశెట్టి ప్రశాంత్ పంటభూమిలో మామిడి చెట్టుకు మామిడి కాత కాసింది. సాధారణంగా మామిడి కాయలు వేసవిలో అధికంగా కాస్తాయి. కానీ ఈ చెట్టు మాత్రం వర్షాకాలంలో కాసింది. ఇలా కాయడం ఇది రెండోసారని రైతు తెలిపాడు. రోడ్డు వెంబడి వెళ్లే వారు మామిడి చెట్టు కాతను ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

ఎస్జీటీయూను బలోపేతం చేయాలి



ఆర్మూర్‌టౌన్: మండలాల్లో ఎస్జీటీయూను బలోపేతం చేయాలని సంఘ నాయకులు అన్నారు. పట్టణంలోని టీఎన్జీవోఎస్ కార్యాలయంలో ఆదివారం ఆర్మూర్, ఉమ్మడి బాల్కొండ, జక్రాన్‌పల్లి, వేల్పూర్, భీంగల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నాయకులు వెంకటరమణ, మోహన్, మధు, పోలాస రాములు, శ్రీనివాస్, ప్రభాకర్, రఘు, ప్రసాద్, దినేష్ రోజా, శిరీష, కృపాణి పాల్గొన్నారు.

అంధ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి

నిజామాబాద్‌రూరల్: బదిలీలలో అంధ ఉద్యోగులు కోరుకుంటే తప్ప బదిలీ చేయరాదని శాఖపరమైన పరీక్షల నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. నగరంలో ఆదివారం విజ్వల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లో అంధ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తున్నమన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లపై ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని ఆమోదించామన్నారు. జిల్లా అధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, సహాధ్యక్షులు శివకుమార్, సలహాదారు ఆరోగ్యరాజ్, రజని, దత్తాత్రి, రాజేశ్వర్, రేఖ మోహన్, చిన్నయ్య నర్సయ్య, లక్ష్మణ్, పాహిమా పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ఆర్మూర్‌లో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్ల పక్కన, మూలమలుపుల వద్ద విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కానీ రక్షణగా కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. పట్టణంలోని జీవన్‌మార్గ్‌లో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న కంచెను కొన్నిరోజుల క్రితం కారు ఢీకొనడంతో ధ్వంసమైంది. ఇప్పటికీ అధికారులు నూతన కంచె ఏర్పాటు చేయలేదు. మామిడిపల్లిలోని ఆదర్శనగర్‌లో వీధి నెంబర్ 5లో మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ఉన్నాయి. ఈ దారుల గుండా నిత్యం వాహనాల రాకపోలు సాగుతుంటాయి. ప్రమాదాలు జరుగక ముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మామిడిపల్లిలో..

రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి



ఎడపల్లి(బోధన్): ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ కోరారు. ఎడపల్లిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణితో వేలాదిమంది రైతుల సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇటీవల జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుంట రాజేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేయలన్నారు. నాయకులు మల్లేష్, సుదర్శన్, రవి, షేక్ నసీర్, చిన్న పోశెట్టి, హనుమాండ్లు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



బోధన్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం ఆదివారం బోధన్‌లో సీఐటీయూ నాయకులు విరాళాలు సేకరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. వయనాడ్ వరద బాధితుల సంఘీభావ నిధి కోసం చేపట్టిన విరాళాల సేకరణకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శివలింగం, రాములు, పోశవ్వ, అంజని, రేఖ, నాగమణి, శేషాబాయి, చాండ్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలాల్లో ఆదివారం సీపీఐఎం, ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను వయనాడ్ బాధితులకు పంపించినట్లు వారు పేర్కొన్నారు.నాయకులు యేశాల గంగాధర్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) బోధన్ కార్యదర్శి గైని రాములు, రామ్ పటేల్, సాయినాథ్, చింటూ, ఎల్లయ్య, పోచవ్వ ఉన్నారు.

సంక్షిప్తం

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాత్రికేయులకు సన్మానం



కోటగిరి: మండలం కేంద్రంలో ఆదివారం కోటగిరి మండల ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పోతంగల్, కోటగిరి పాత్రికేయులకు సన్మానం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిర చేసిన పోరాటాల్లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదన్నారు. నాయకులు సోంపూర్ పోచిరాం, దౌలయ్య, నాగయ్య, ఆనంద్, గంగాధర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి..



బోధన్‌రూరల్: పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బదిలీపై వెళ్తున్న రూరల్ ఎస్సై నాగనాథ్‌ను సాలూర కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మండలాధ్యక్షుడు రవి, నాయకులు అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986–87 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. హెచ్ఎం గంగారాం పూర్వ విద్యార్థులను అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్ శివారులోగల గైనిగుట్ట బసవేశ్వర ఆలయంలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో చోరీల నివారణకు, భక్తుల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు రాజు, ఆలయ పూజారి పరమేష్ మహారాజ్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ, పడకల్‌లతో పాటు వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేశారు. నాయకులు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, కనక రవికుమార్, తాజొద్దీన్, కుడాల వినోద్, నల్ల గంగారెడ్డి, గంగాధర్, రాజేష్‌గౌడ్, విఠల్, అరుణ్, రాజేందర్, రవిగౌడ్ పాల్గొన్నారు.

మాలమహానాడు ధర్నా

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆదివారం మాల మహామహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్, నగర అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు బంగారు సాయిలు పాల్గొన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు.

అతివకు బీమా.. కుటుంబానికి ధీమా

- ఇందిరా జీవిత బీమా పథకంతో నదుపాయం



స్వయం సహాయక సంఘం సభ్యుల సమావేశం (ఫైల్)

కమ్మర్‌పల్లి: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగా మహిళ సంఘాల సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తోంది. అయితే రుణం తీసుకున్న సభ్యులు మరణిస్తే ఆ రుణ భారం కుటుంబ సభ్యులపై పడేది. దీంతో మహిళా సంఘాల్లో బకాయిలు పెరిగి మొండి బకాయిలు అక్కడక్కడ పెరుగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో మహిళా సంఘాల్లో ఉన్న క్రమశిక్షణను కాపాడేందుకు, మరణించిన సభ్యుల కుటుంబంపై భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న 'ఇందిరా జీవిత బీమా' పేరిట బీమా సదుపాయాన్ని అమలులోకి తెచ్చింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ, ప్రమాద బీమా పథకాలను అమలు చేస్తోంది. రుణ, ప్రమాద బీమాలకు మహిళా సంఘం సభ్యురాలి నుంచి ఒక్క రూపాయి ప్రీమియం వసూలు చేయకుండా మొత్తం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.

రుణ బీమా..

రుణ బీమా కూడా ఇందిరా జీవిత బీమా పథకంలో భాగంగానే అందిస్తున్నారు. ఈ బీమా బ్యాంకు లింకేజీ ద్వారా వర్తిస్తుంది. మహిళా సంఘంలో రుణం తీసుకున్న మహిళ ఏదైనా కారణంతో మరణిస్తే, సదరు మహిళ మరణించే నాటికి ఎంత అప్పు ఉంటే అంత మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంబంధిత లోన్ అకౌంట్‌కు చెల్లిస్తారు. ఒక్కో సభ్యురాలికి గరిష్ఠంగా రూ.రెండు లక్షల వరకు రుణబీమా సదుపాయం కల్పిస్తారు.

ఆన్‌లైన్‌లో నమోదు

బీమా సదుపాయానికి సంబంధించి మహిళలు ప్రత్యేకంగా ఎటువంటి ధృవ పత్రాలు సమర్పించనవసరం లేదు. మార్చి 14 నాటికి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదై ఉన్న మహిళా సంఘాల సభ్యులందరికి బీమా వర్తిస్తుంది. ఒకవేళ మహిళ మరణిస్తే మాత్రం వివరాలతో పాటు, తగిన ఆధారాలను ఐకేపీ కార్యాలయంలో అందించాలి.

ప్రమాద బీమా..

ఇందిరా జీవిత బీమా పథకంలో భాగంగా మహిళలకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని 18 నుంచి 59 ఏళ్ల వయసులోపు సభ్యురాలు ప్రమాద బీమాకు అర్హురాలు. మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులు తగిన ఆధారాలను సంబంధిత కార్యాలయంలో అందిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా సొమ్మును అందజేస్తారు.

బీమాతో సంఘాలకు రక్షణ



ఇది వరకు మహిళా సంఘాలకు ఎలాంటి బీమా సదుపాయం లేదు. సభ్యురాలు అకాలంగా మరణిస్తే వారి కుటుంబ సభ్యులపై రుణభారం పడేది. తాజాగా ప్రభుత్వం బీమా కల్పించడంతో సంఘాలకు ఊరట కలిగింది.

– కుంట గంగాధర్, ఐకేపీ ఏపీఎం, కమ్మర్‌పల్లి

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌రూరల్: నగరంలోని ద్వారకనగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా 7వ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఆకుల అరుణ (నిజామాబాద్), ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి(బాల్కొండ), అగ్గ సునీత(మోపాల్) తదితరులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ





కులాస్‌పూర్ తండాలో గోధుమబుట్టలతో గిరిజనులు .. నిజామాబాద్ నగరంలో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఆదివారం జిల్లా బంజారా కమిటీ ఆధ్వర్యంలో తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ మండలాల్లోని గిరిజనులు, యువతులు పాల్గొన్నారు. యువతులు గోధుమలను బుట్టలో పోసి తొమ్మిది రోజులపాటు దగ్గరలోని సేవాలాల్, జగదాంబ మాత ఆలయాల్లో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాటిని ఊరేగింపుగా జిల్లా కేంద్రానికి తీసుకొని వచ్చారు. ఊరేగింపులో పలువురు నృత్యాలు చేశారు. మరికొందరు గుర్రంపై సవారిచేసి విన్యాసాలు చేశారు. అనంతరం డిచ్‌పల్లి నాగ్‌పూర్‌గేట్ వద్ద గల కుంటలో నిమజ్జనం చేశారు. మాజీ కార్పొరేటర్ చాంగుబాయి, డా.సులోచన, చంద్రకళ, హరికృష్ణ, మోతిలాల్, బిలోజినాయక్, బలరాంనాయక్, ప్రియా, శంకర్‌నాయక్, గణేష్‌రాథోడ్ ఉన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ చాంద్‌మియాబాగ్ తండాలో ఆదివారం గిరిజనులు తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా గోధుమ బుట్టలను పెళ్లికానీ యువతులు నెత్తిన పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, తండా పెద్దలు రవీందర్‌నాయక్,మోతిసింగ్,రాజేందర్, శ్రీదాస్,రెడ్డి,మహేష్,సురేష్,శంకర్,జీవన్,శివ పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌తండాలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు గోధుమ బుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోధుమ బుట్టలతో ఊరేగింపు వెళ్లి, చెరువులో నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు శీను నాయక్, బలరాం నాయక్, బిలియా నాయక్, రావు సింగ్ నాయక్, మాజీ ఎంపీపీ లతా కన్నీరాం, మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ బాలు నాయక్ పాల్గొన్నారు.

మనమంతా భరతమాతకు రక్షగా ఉండాలి



సుభాష్‌నగర్: సోదరసోదరీమణులు ఒకరికి ఒకరు రక్షగా ఉంటూ, మనమంతా భరతమాతకు రక్షగా ఉండాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని 7వ డివిజన్ శాంతిభవన్‌లో ఆదివారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోదరభావానికి ప్రతీకగా భారతదేశం అంతా జరుపుకునే పండుగ రాఖీ అని అన్నారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో సోదరభావాన్ని, దేశభక్తిని నింపే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఓం శాంతి భవన్ సభ్యులు బీకే వనజ, బీకే సుజాత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ సుక్క మధు, నాయకులు ఇప్పకాయల కిషోర్, మఠం పవన్, కిరణ్, దీపక్, బాబీసింగ్, శేఖర్ పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	పాగల్ వీఎస్ కాదల్ (తెలుగు) – 02.15 భవనం 4.35, 10.20 సింబ (తెలుగు) – 7.35
స్క్రీన్-2 –	కమిటీ కుర్రోళ్లు – 12.30, 3.45, 07.00, 10.15
స్క్రీన్-3 –	మురారి (తెలుగు) – 11.05, 6.00, 10.00
స్క్రీన్-4 –	రాయన్ (తెలుగు) 11.40, 6.35, కల్కి 2898 ఏడీ (తెలుగు) – 2.50, 9.45